బల్లకట్టు భద్రయ్య

అల్లంత దూరాన్నుంచే రంగుచీరె నల్ల ప్యాంటు కనబడ్డాయి నది ఒడ్డున కూర్చున్న భద్రయ్యకు. గుండెలోనుంచి సంతోషతరంగం ఉవ్వెత్తున లేచింది.

భద్రయ్య మధ్యాహ్నం నుంచీ ఎవరైనా ప్రయాణీకులు ఏరుదాటటానికి వస్తారేమోనని, ఎదురు చూసీచూసి కళ్ళు కాయలు కాసినట్టయ్యాయి. ఊఁహుఁ. ఒక్క ప్రయాణీకుడయినా రాలేదు. ఏ ఒక్కరు వచ్చినా మనిషికి పావలా.

అటువంటి పావలాలు ఓ పదైనా తెస్తేగాని 'నలుగురి పిల్లలకు గంజెట్లా పొయ్యను?' అంటూ నిలవేస్తుంది పొన్ని.

తను మటుకేం చేసుకుంటాడు? పది పావలాలు కాక మరి నాలుగు పైన దొరికిన్నాడే ఈత పుంతలోకి పోతాడు ఇప్పటికి వారమయింది___ ఆ పది పావలాలే సరిగా దొరకటంలేదు ఈ మాటంటే పొన్ని నమ్మదే? అనుమానం మడిసి.

ఇంటికి పోగా 'సిన్నోడికి జొరం అంటుంది. పెద్దోడికి పంచె కావాలంటుంది సిట్టితల్లికి ఒళ్ళు కప్పను పైటగుడ్డ కావాలంటుంది ఏనాడయినా సంబరంగా ఓ కోక కొనిచ్చినవా? గువ్వకన్ను రైకంటె పానం, ఆ సంగతి గయించావా!' అంటుంది.

తనకీ తేవాలనే ఉంటుంది. కాని గవ్వలు కావే చేతిలో ఆడటానికి? డబ్బులాయెను- డబ్బులు.

ఈతపుంతకు పోనివాడు పొన్నితో 'సూత్తాలేవే' అనబుద్ధవుతుంది. పోయిన్నాడు తన్నబుద్ధయితుంది. ఉడుకు సల్లారినాక 'డబ్బులుంటే తేననే? నాకు మాత్తరం సంబరం కాదూ?' ఈ మాట అనాలనుకుంటాడు. కాని అనబుద్ధికాదు.

మళ్ళీ తెల్లారి 'ఇయ్యాళయినా తెస్తావా?' అంటుంది ఆశతో. 'అట్టనే' అంటాడు నవ్వుతూ.

"ఇట్టనే బతుకులు గడిచి పోతుండాయి" అనుకుంటాడు భద్రయ్యా బీడీ కాలుస్తూ.

రంగుచీరె నల్ల ప్యాంటు మరింత దగ్గరగా వచ్చారు.

సంబరంగా లేచి నిలబడ్డాడు భద్రయ్యా.

"రండి, దొరా రండి జేగి రండి. అయ్యగారు ఈ మద్దెన రాకుండయి నారు" తలపాగా సర్దుకుని "ఓ యబ్బ! దొరసాని కూడ అచ్చారు. ఈయాల నాకు పండగే," అన్నాడు ఆమెను కిందికీ పైకీ పరిశీలనగా చూస్తూ.

నవ్వాడు నల్లసూటాయన "భద్రయ్యా మరిచిపొయ్యావా? ఇన్నాళ్ళూ కాలేజికి సెలవులే కదా. ఇవాళే తెరిచారు. పొద్దున ఇటే వెళ్లానే?" అన్నాడు ప్యాంటు జేబులో చెయ్యి పెట్టుకుంటూ.

"ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. ఈ సెలవుల్లో ఏం జరిగిందనుకున్నారు? ఆ రామిగాడు నాతో పోటీకి నిలబడ్డడు. బద్దలతో నాను కట్టినట్టే బల్లకట్టు తయారు చేసిండు పొద్దుపేలకు ఏటిఒడ్డుకు సిద్ధమయినడు. అప్పుడు పెద్ద గొడవయిపోనాదనుకోండి. మనూరి పెద్దలంత కూడి ఇనుకోని తీర్పు సెప్పినారు గందా—ఆడు పొద్దుపేళనుంచి మధ్యాన్నం ఒంటిగంట వరకు—ఆ కాడినుంచి నాను రాత్రి ఎనిమిది కొట్టేవరకు నడుపుకోవాలని."

"మరింకేం? సరిగ్గానే పంచారు. ఇంకా నీవు పాతమనిషివి కదా అని నీకెక్కువే పైమిచ్చారు." నవ్వాడు ఆయన.

"అట్ట కాదండి, ఆడికి పిల్లాజెల్లా లేదు. మరి నాకో? తల్లితో కూడా ఐదుమంది కడుపులు నింపాలి అయ్యగోరూ."

"నీ అదృష్టం బాగుంటే ఓ పాతిక మంది ఎక్కితే లాభమేగా భద్రయ్యా?"

"అవునండి, కాని అట్ట జరుగుద్దా పెతిరోజూ?"

"ఇవాళ ఎంత సంపాదించావు ఇంతవరకు?"

"ఒక్క పావలా డబ్బులు చేతిలో పడలేదు బాలయ్యా. తమదే బోణీ."

"సరే ఇవాళే నాకు పాత లెక్కలేవో చూసి దబ్బిచ్చారు. బోణీ అంటున్నావు కనుక ఈ రూపాయి తీసుకో." పర్సులోనుంచి తీసి యిచ్చాడు.

ఆ రూపాయ కాగితాన్ని సంబరంగా అందుకొని బల్లకట్టు దగ్గరికి వెళ్ళి దానికి తాకించి దణ్ణం పెట్టాడు. గడ చేతిలోకి తీసుకుని "రండి బాబయ్యా రండి" అన్నాడు.

ఏటిఒడ్డున ఇసకలో కాళ్ళు కూరుకుపోతున్నాయి. ఆయన బూటు దులుపుకుంటూ అడుగులు వేస్తున్నాడు. ఆమె చీరె కుచ్చెళ్ళను ఒకచేత్తో పైకి పట్టుకుని చెప్పులు ఇంకో చేతికి తగిలించుకుని బల్లకట్టు దగ్గరికి వచ్చింది.

ఆయన ఒడ్డుమీది నుంచే రెండోకాలు బల్లకట్టుమీద పెట్టి ఎక్కాడు.

"బలరాం. నాకు చెయ్యి అందించవూ?"

ఏదో పిట్టకూత అన్నట్టు పక్కకు తిరిగి చూశాడు భద్రయ్య.

తన రెండుచేతులతో ఆమె చేతులు పట్టుకుని పళ్ళు బిగించి పైకి లాగాడాయన.

ఆ బల్లకట్టుకు నాలుగు మూలలో నాలుగు మొద్దులు ఎత్తుగా కుర్చీపీటల్లా ఉన్నాయి. జేబు రుమాలుతో దులిపి సుతారంగా వాటిమీద కూర్చున్నారు ఇద్దరూ. అతదేదో సన్నగా అంటున్నాడు. ఆమె కిసుక్కున నవ్వుతున్నది. ఇద్దరూ ఏవేవో కబుర్లు చెప్పుకుంటున్నారు. ఆమె మధ్య మధ్య గునుస్తూ అలుగుతూ బెదిరిస్తూ మాట్లాడుతున్నది.

అత దన్నిటికీ చిరునవ్వుతోనే సమాధానమిస్తున్నాడు.

"నీకేం? నా సంగతి ఆలోచించు" అంతలోకి ఆమెకు కన్నీళ్ళు.

భద్రయ్య వెనక్కు తిరిగిచూశాడు 'ఎంత చక్కగ ఉందాయమ్మ? ఇద్దరూ సిలకా గోరింకల్లాగున్నారు. అదేం? ఆళ్ళకూ తగవులేనా? ఈ అయ్య ఆ యమ్మ నేదో అనకపోతే కంట తడిపెడుతుందా? ఏందో పెపంచకం' భద్రయ్య తల గోక్కున్నాడు.

"మన మెక్కడున్నామో గ్రహించావా? ఇది బల్లకట్టు మనం నీళ్ళ మీద న్నాము. నీళ్ళమీద ప్రయాణం చేసేటప్పుడు మనసులు బరువుగా ఉండకూడదు. ఘర్షణలు పనికిరావు. అసలే నది వర్షాలకు పూటుగా ఉంది."

"అయితే?"

"అయితేనా? మాటలకూడా—అందులో కోపంవల్ల వచ్చే మాటలకు ఎంతయినా బరువుంటుంది. ఆ బరువుకు డబ్బున ఈ తెప్ప మునిగిపోవచ్చు."

"మునిగితేనా?" కన్నీరు కార్చినందువల్ల ఎర్రబడ్డ ముఖంతో- జ్యోతుల్లాంటి కళ్ళతో ఉరిమిచూస్తూ "నేను ఒక్కదాన్ని మునిగినా ఫరవాలేదు. కాని నీవు మునిగితివా...." అతడిని తిరస్కారంగా చూసింది.

బలరామ్ భద్రయ్య వైపు వేలుపెట్టి చూపిస్తూ జాగ్రత్త అన్నట్టు ముక్కుమీద వేలేసుకున్నాడు.

ఆమె భద్రకాళిలా నేలమీద కాళ్ళు తాటించింది.

బోటు దరిజేరింది. ముందుగా బలరామ్ దూకాడు. ఆమెకు చేతులందించబోయాడు.

ఆమె అతడి చేతులు తోసేసి ధైర్యంగా ఒడ్డుమీదికి దూకింది. ముఖమింకా రుసరుసలాడుతూనే ఉంది.

"అయ్యగారూ దణ్ణం. అమ్మగారూ దణ్ణం." భద్రయ్య ఒడ్డుమీద నిలబడ్డాడు.

వెనక్కు తిరిగి చూశారిద్దరూ. ఆయన నవ్వాడు. ఆమె ముఖం ముడుచుకుంటూ ముందుకు సాగింది.

ఎంత సక్కంగ ఉన్నారిద్దరు! చిదిపితే పాలుగారే బుగ్గలాయమ్మవి. కళ్ళెంత బాగుండాయి? ఆ దొర ఆ యమ్మకు తగినట్టే ఉండడు. ఆ యమ్మకోసమే పుట్టాడు కావాల. ఆ అమ్మయితే ఆయన కంటే మిన్నగుంటది. భద్రయ్య వాళ్లు వెళ్లిన దారివంకే చూస్తూ అనుకుంటున్నాడు.

"అటు పోద్దా ఈ బల్లకట్టు!" పెళ్ళివారి గుంపులా ఉంది. పెట్టెలు తలా మీద పెట్టుకుని పిల్లలను చంకనెక్కించుకొని పాతిక మంది దాకా వచ్చారు.

''పోతది రండి రండి" భద్రయ్యకు బలరాం-ఆమె కళ్ళల్లో మెదులుతుండగా కళ్ళు నులుపుకుని-పిలిచాడు వాళ్లను.

వాళ్లందరూ పెళ్లికబుర్లు చెప్పుకుంటుండగా భద్రయ్య మనసులోనే ఏవేవో పథకాలు వేసుకుంటూ వాళ్ల దగ్గర పాతిక పావలాలు వసూలుచేసి చిన్న జోలె సంచీలో వేసుకొని మొలలో దోపుకున్నాడు.

మళ్లీ అటునుంచి కొందరు విద్యార్థులు, గ్రామీణులు పదిమంది ఎక్కారు.

'ఇదేంది ఇయ్యాళ? భూమి ఈనినట్టుగా ఉండాదే?' అనుకున్నాడు భద్రయ్య.

ఇంకా సూద్దాం-ఇంకా సూద్దాం అనుకుంటూ రాత్రి ఎనిమిది గంటలవరకూ ఉన్నాడు భద్రయ్య నది ఒడ్డున చీకటి. పడినకొద్దీ జనం తగ్గారు.

బల్లకట్టును అక్కడే గుంజకు కట్టేసి పదకొండు రూపాయల పావలా లెక్కబెట్టుకొని తిరిగి జోలి సంచిలో వేసుకుని మొల్లో దోపుకునినడవటం మొదలు పెట్టాడు భద్రయ్య

అక్కడికి నాలుగు బారల దూరంలో ఒక మలుపు వచ్చింది. ఆ మలుపుకు బారెడు దూరం సాగిన తరువాత బాట రెండుగా చీలిపోతుంది. కుడిచేతివైపు బాట తిన్నగా భద్రయ్య ఇంటికి చేరుతుంది. ఎడమచేతి వైపుది ఈత పుంతకు దారితీస్తుంది.

మలుపులో నిలబడ్డాడు భద్రయ్య. ఇయ్యాళ డబ్బులు ఎప్పటికంటే కూసిని ఎక్కువే దొరికినయ్. ఓ రెండు ఖర్చువేసి ఈతకల్లు ఓ ముంతుచ్చుని-మిరపకాయ బజ్జీలు తిని-నరిసితో సరసమాడి ఇంటికెళ్తే?

ఇదొక ఆలోచన.

పొన్ని మనసుపడ్డ గువ్వకన్ను రెయికకొని. సిన్నోడికి సొక్కాకొని మిగిలిన పైకం పొన్నిచేతిలో పోస్తే?

ఇది రెండవ ఆలోచన.

ఈతకల్లు - మిరపకాయబజ్జీలు తలుచుకుంటేనే నోరూరింది. నరిపితో సరసమంటే ఒళ్ళు పులకరించింది

గువ్వకన్ను రెయిక తనకు - పిన్నోడికి సొక్కా-రేపటి తిండి గింజలకు డబ్బులిస్తే పొన్ని పడేసంతోషం కళ్ళల్లో మెరిసింది అంతలో.

కూసింతసేపే ఆలోచన. కూసింత సేపా ఆలోచన. ఏందో పాడుమణుసు? గొణుక్కున్నాడు భద్రయ్య.

కదిలాడు భద్రయ్య ఎడమచేతి వైపుకు. అడుగులు తొందర తొందరగా పడుతున్నాయి. కన్ను తెరచి కన్ను మూసేటంతలో వచ్చేసింది ఈతపుంత.

అక్కడ కోలాహలంగా ఉంది. ముంత ఒకచేత బట్టుకుని మిరపబజ్జీ మరొకచేత బట్టుకొని గంతులు వేస్తున్నారు జనం. మగ అయిందీ ఆడ అయిందీ తెలుసుకోలేకుండా సరసా లాడేస్తున్నారు.

భద్రయ్య కల్లుముంత చేతబట్టడం ఎగురుకుంటూ తాగుతూ బజ్జీలు నంజడం అయింది. ఇంక సరసమాడ్డానికి నరిపి ఎక్కడుందోనని చూస్తున్నాడు. నరిపి బజ్జీలమ్మే రాములమ్మ కూతురు. ఇరవై ఏళ్ళది. చింతాకంత కళ్ళు-పెద్దగా ముందుకు పొడుచుకుని వచ్చిన పళ్ళతో చింతపిక్కలా మెరిసిపోతూ ఉంటుంది.

ఒళ్ళు తెలియకుండా ఎగుర్తూ పడుతున్న భద్రయ్య చేతిని ఎవరో ఒడిసి పట్టారు.

నరిపి అనుకుని "రాయే పోదాం అటు." భద్రయ్య ఆ చేతిని రెండు చేతులతో బంధించాడు.

"ఆఁ హాఁ? ఎటు?"

చివ్వున తలెత్తి చూసిన భద్రయ్య తుళ్ళిపడ్డాడు.

"మామోయ్ మామా. ఇంటికి పోయి అడనే సరసమాడుకుందాం రా. ఏం కత? ఇయ్యాళ శాన సంతోషంగా ఉండావు?" అతడి నడుమంతా సర్ది జాకి

సంచీ అందుకొని తన రెయికలో దాచేసి లొక్కుపోతున్నది పొన్ని తన గుడిసె వైపుకు భద్రయ్యను.

ఆ కైపులో నోరెత్తకుండా ఆమె వెంట దిక్కులు చూస్తూ అడుగులు వేస్తున్నాడు భద్రయ్య పళ్ళు బైటపెట్టి.

ఇంటికి రాగానే పట్టెడన్నం తినిపించి భద్రయ్యను కుక్కిమంచం మీదికి తోసింది పొన్ని.

మరుసటిరోజు బాగా పొద్దెక్కి లేచాడు భద్రయ్య. అప్పటికి పొన్ని అన్నం వొండి పిల్లలకు పెట్టింది.

"కూడెట్టలే. ఏమయింది" అన్నాడు భద్రయ్య తలవంచుకొని.

"రా. ఎల్లిపాయేసి కారం నూరాను. పులుసొండాను.రా. కలిసి తిందాం." పొన్ని ఇంత సంతోషంగా ఉండగా భద్రయ్య చూడలేదు ఈ మధ్య.

భద్రయ్య మీసాలచాటు నవ్వు నవ్వు కున్నాడు. రాత్రి ఏం జరిగిందో తనకు కొంతే తెలుసు. దరవాతేం జరిగిందో పొన్నికి బాగా తెలుసు.

దొంగచూపులు చూశాడు పొన్ని వైపు. పొన్ని ఓరగంట కనిపెడుతూనే ఉంది భద్రయ్యను.

సరిగ్గా తన వేళకు భద్రయ్య బల్ల కట్టు దగ్గరికి చేరుకుని ఒడ్డున కూర్చున్నాడు. ఐదారుమంది పాటకజనం ఇటునుంచి అటు-అటు నుంచి ఇటు బల్లకట్టు మీదినుంచి దాటారు. ఒడ్డు మీద ఒక రాతిమీద కూర్చుని భద్రయ్య బీడీ కాల్చుకోవటం మొదలుపెట్టాడు.

ఐదుగంటల తరువాత నల్లప్యాంటు. రంగుచీర అంత దూరాన్నుంచి వస్తున్నట్టు చూశాడు. భద్రయ్యకు వాళ్ళను చూడగానే గతరాత్రి జరిగిన సంగతి చప్పున జ్ఞాపకం వచ్చింది మళ్ళీ మీసాల చాటు నవ్వు నవ్వుకున్నాడు.

"దణ్ణం దొరా. రండి రండి." అన్నాడు అల్లంత దూరాన వాళ్ళుండగానే.

"ఇవాళ కూడా మాదేనా బోణీ ?"

"బోణీ ఇదివరకే అయింది." నవ్వుతూ అతడు తెప్పమీద కాలుంచి ఎక్కాడు. మామూలుగా ఆమెకు చేతులందించాడు బలరామ్.

చేతులులేని బ్లవుజు-తెల్లటి జబ్బలు-మిసమిసలాడే వయసు-మైమరపించే కనుదోయి-కవ్వించే వంపులు-ముఖంలో క్షణం రుసరుస-క్షణం కిలకిల నవ్వులు చూసి బలరామ్ కళ్ళు కాంక్షతో తళతళలాడుతున్నాయి.

ఆమె రెండు చేతులూ చాపటం. అతడు వాటిని అందిపుచ్చుకుని సంబరంగా పైకి లాగటం చూస్తున్నాడు భద్రయ్య పక్క-చూపులతో.

మామూలుగా ఇద్దరూ కూర్చున్నారు. నమ్‌కిన్ కాజూ పొట్లమొకటి ఆమె చేతికిచ్చి తానొకటి విప్పాడు. మళ్ళీ అంతలోనే దాన్ని మడిచి జేబులో కుక్కుకున్నాడు బలరామ్.

"ఏం? నీవు తినవా?" కళ్ళతో కవ్వించింది మీను

"ఏం? నీ దాట్లోంచి పెట్టావా?" అన్నాడు బలరామ్ చేతులు చాపుతూ.

"మరయితే రెండెందుకు కొన్నావ్? అది కూడా తే. విప్పుతాను. ఇద్దరం ఇక్కడే తిందాం." చెయ్యి చాపింది.

"వద్దులే అది ఉండనీ. దాని సంగతి తరువాత ఆలోచిద్దాం." అన్నాడు బలరామ్.

"ఊఁ హూఁ. అది కూడా విప్పాల్సిందే. ఇవాళ ఇంకేమయినా ఆలోచనలు వస్తున్నాయా?" ఆమె కినుక వహించినట్టు కనుబొమలు కలుసుకోవాలని చూస్తున్నాయి.

బలరామ్ అందుకు అవుననలేదు, కాదనలేదు. ఆమెవంకే చూస్తున్నాడు పిచ్చిపట్టినట్టుగా.

"నీవు ఇంట్లో నుంచి కదలనట్లే కనబడతావు. కాని ఎప్పుడో నన్ను ఏమార్చి వాళ్ళను కలుస్తూనే ఉన్నావు. ఇంకా నీకు పూర్వవాసనలు పోలేదు" మాతి సున్నాలా చుట్టింది.

బలరామ్ హృదయం కలుక్కుమంది.

"నీకు నా యింట ఎన్ని సుఖాలు ? ఎన్ని రకాలు ? ఆ మెత్తని ఫోమ్ బెడ్లు-స్ప్రింగ్ కాట్లు-హైక్లాసు ఫర్నిచరు-ఇంద్ర భవనంలాంటి ఇల్లు - నందనవనం లాంటి తోట-ఖరీదయిన భోజనం-పిలిస్తే పలికే నౌకర్లూ - రంభ మేనకలను మించిన మీను ఎక్కి తిరగటానికి పడవలాంటి కారు-ఎన్ని ఉన్నా-ఆ మురికోడే ఆ యిల్లాలినీ - కట్టు గుడ్డలయినా సరిగాలేని ఆ పిల్లలనూ జ్ఞాపకం తెచ్చుకుంటూ అంతలోకి కుంగిపోతావేం?" అన్నట్టు నిప్పుకణంలాంటి ఓ చూపు చూసిందిమీను.

"అబ్బెబ్బె. అదేంకాదు. మనం ఇంటి దగ్గర తినటానికి ఒకటి ఉండాలి కదా అని దాచాను." నసిగాడు బలరామ్.

భద్రయ్య వాళ్ళ మాటలు వింటూ ఆలోచనలో పడ్డాడు. వీళ్ళిద్దరిలో ఏదో తిరకాసు ఉన్నట్టుందన్న అనుమానం మెదిలింది మనసులో.

"బలరామ్ ! నేను చెప్పినట్టుగా సెలవు పెట్టావా ? అసలు నీకీ పాడు ఉద్యోగం ఎందుకు చెప్పు ? కొంతకాలం అట్లా బొంబాయి వైపులకు పోదాం పద. మనం కారులోనే పోవచ్చు. ఏమంటావు ?"

"ఆ ప్రోగ్రాం ఇప్పుడు కుదిరేటట్టు లేదు మీనూ. ప్రిన్సిపల్ సెలవు ఇవ్వ నన్నాడు. మరొకసారి అంటే దసరాలకు వెళ్దాం. ఏమంటావు ?"

"ఆఁ హాఁ ? అదేం కుదరదు. నీవసలు సెలవు అడిగావా ? నీమాట నమ్మమంటావా ?" నిలవదీసింది.

"ఎందుకా సందేహం ?"

"నమ్మలేనోయ్ నిన్ను. అందులో నీవంటి వాళ్ళను అసలే నమ్మలేను."

"ఏం చేస్తాం ? ఈ జీవుడు చేసుకున్న పుణ్యం."

అంతలో ఒడ్డుకు చేరింది బల్లకట్టు. ఇద్దరూ ఒడ్డు మీదికి దూకేశారు.

ఆనాడు భద్రయ్యకు సంచి నిండా డబ్బులు లేకపోయినా తాటిపుంతకు చేరాడు. ముంతెడు కల్లు తాగిన తరువాత బజ్జీలు చేతిలో ఉండగానే పొన్ని

వచ్చింది ''మామోయ్ మామా'' అంటూ భుజమ్మీద చెయ్యివేసి తీసుకు వెళ్లింది తన గుడిసెకు.

భద్రయ్య ఎటువంటి పరిస్థితిలో ఉన్నా పొన్ని తియ్యటి కంఠంతో 'మామోయ్ మామా' అన్న పిలుపు వినగానే ఈ లోకంలో మరేం కనిపించదు-వినిపించదు-అతడికి.

మామూలుగా చిలకాగోరింకలు ఊసులాడుకుంటూ నవ్వుతూ తెప్ప ఎక్కటానికి వస్తూనే ఉన్నారు. తెప్పమీద ఉన్నంతసేపూ వాళ్ళను చూసి మురిసిపోతాడు భద్రయ్య.

చటుక్కున పొన్ని పొద్దటిపూట చెప్పిన మాట జ్ఞాపకం వచ్చింది. "సిన్నోడికి జొరం. సిట్టి తల్లికి ఒళ్ళు కప్పను పైట గుడ్డ కావాలని" మరీ మరీ చెప్పింది. "ఏనాడయినా అడగకుండా కోక తెచ్చినవా ?'' అంటూ దెప్పింది.

తనకీ తేవాలనే ఉంటుంది. కాని గవ్వలు కావే చేతిలో ఆడటానికి ? డబ్బులు, డబ్బులు. ఒక్కోరోజు ఎంత కష్టపడ్డా పది పావలాలు కూడిరావు. ఆ ప్రశ్నకిదే ఎప్పటికీ జవాబు అయిపోతున్నది.

ఇది ఎప్పుడూ జరిగేదే. అయితే ఓకటి - ఒకరికి కోపం వచ్చినప్పుడు ఇంకొకరు కోపం తెచ్చుకోరు. నవ్వేస్తారు కోపాలేమిటి మనమధ్యఅనుకుంటారు

తెప్ప బయలుదేరింది. నాలుగు బారలు సాగింది.

''నాన్నా ! నాన్నా !'' పరుగెత్తుకుంటూ వస్తున్నాడు పన్నెండేళ్ళ పిల్లవాడొకడు.

''ఆపు. ఆపు. నేనూ ఎక్కుతా'' అంటున్నాడు రొప్పుతూ.

పూల తెప్పపైన తేలిపోతున్నట్టుగా ఉన్న బలరామ్‌కు ఆ కేకలు వినబడటం లేదు. పక్క నుంచి వచ్చే కోకిల కూజితాలే చెవులలో ప్రతిధ్వనిస్తున్నాయి

భద్రయ్య వెనక్కు తిరిగాడు. పిల్లవాడు రొప్పుతూ ఒడ్డున నిలిచాడు

రివ్వున బల్లకట్టు వెనక్కు తిరిగింది ఒడ్డుకు చేరిన భద్రయ్య ''ఏం బాబూ ఎక్కుతావా ?'' అడిగాడు

బలరామ్ ఆ తన్మయత్వంలో తెప్ప వెనక్కి తిరిగినట్టే చూడలేదు. పిల్ల వాడి కంఠధ్వనికి గతుక్కుమన్నాడు.

"నాన్నా! నీ కోసం కాలేజీ అంతా తిరిగాను. అందరినీ అడిగాను. మన లిల్లీకి జ్వరంలో ఫిట్లు వస్తున్నాయి. అమ్మ గాభరాపడిపోతోంది. చేతిలో డబ్బు లేదు మందిప్పించటానికి వీలుకాక ముఖమ్మీద చురకలేయించింది. నాన్నా నీవు రావాలి" ఆయాసపడుతూ ఆందోళన పడుతున్న ముఖాన్ని చేత్తో తుడుచుకుంటూ అన్నాడు.

బలరామ్ ముఖంలో నెత్తురుచుక్క లేదు. పిల్లవాడితో ఏం మాట్లాడాలో తెలియలేదు జేబులో తడుముకుంటే చేతికేం తాకలేదు. ఒక పక్క మీను ఏమనుకుంటున్నదోనని ఓరకంట కనిపెడుతున్నాడు. ముడిపడిన ఆమె కనుబొమలు-కోపంతో ఎర్రబారిన ఆమె కళ్లు-అదురుతున్న ముక్కుపుటాలు-చూస్తేనే అతడికి భయంగా ఉంది

"నాన్నా! ఇంటికి రావూ? చెల్లెలూ తమ్ముళ్లూ ఏడుస్తున్నారు నాన్నా! అమ్మ సరేసరి. అన్నం తిని ఎన్నాళ్ళయిందో?"

తల దించుకున్నాడు బలరామ్.

బల్లకట్టు కదిలింది.

అంతలో నీళ్ళల్లో ఏదో దబ్బుమని పడిన చప్పుడు. 'మీనూ మీనూ' అంటూ కాలి బూట్లూ, కోటూ విడిచి బలరామ్ నీళ్ళలోకి దూకి ముందుకు చేపలా ఈదుకుంటూపోతున్న మీనూను వెంబడించాడు.

"అయ్యో! నాన్నా నాన్నా!" పిల్లవాడి అరుపులు మిన్నుముట్టుతున్నాయి.

భద్రయ్య ఇదేదీ పట్టించుకోకుండా తెప్పను ఒడ్డుకు చేర్చాడు.

"రా బాబూ! రా." ఏడుస్తూ తండ్రి వెళ్ళినవైపుకు చేతులు చాపుతున్న పిల్లవాడిని దగ్గరికి తీసుకుని "మీ యింటికి నన్ను తీసుకెళ్ళు. నేనొస్తాను పద" అన్నాడు.

"నాన్న- నాన్న. నీళ్ళలో నుంచి ఎట్లా వస్తాడు? అమ్మతీసుకురమ్మన్నది" వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు పిల్లవాడు.

భద్రయ్య పిల్లవాడి చెయ్యి పట్టుకుని తెప్పలోకి చేర్చాడు. తెప్పనునడుపుతూ "ఏటి బాబూ?" అడిగాడు.

పిల్లవాడికి తండ్రి నీటిలో కొట్టుకుపోతున్నాడన్న భయమింకా తగ్గలేదు. ఏడుస్తూ నీటికేసి చూస్తూ ఇంటి సంగతంతా చెప్పాడు.

భద్రయ్య వెర్రినవ్వొకటి నవ్వాడు.

"బాబూ! మీ నాన్నకేం. భయంలేదు. ఆళ్ళిద్దరూ గజ ఈతగాళ్ళు. ఈ మద్దెన ఆళ్ళు ఈతకొట్టటం బాగా సూశాను. ఆళ్ళిప్పుడు రారు."

"అయితే నాన్న ఇప్పుడు రాడా?" పిల్లవాడి ముఖంలో భయం కొట్టవచ్చినట్టుగా ఉంది.

భద్రయ్య తెప్పను ఒడ్డుకు చేర్చాడు. పిల్లవాడు గెంతాడు. తెప్పను కొయ్యకు కట్టేసి భద్రయ్య పిల్లవాడితో ఇంటికి వెళ్లాడు.

అది నాలుగు కుటుంబాలు అద్దెకున్న పెద్దయిల్లు. వెనకవైపు భాగానికి అద్దె చాలా తక్కువ. ఒకటే కిటికీ. అది పెంకుటిల్లు కావటాన ఆ వెనకభాగం అక్కడక్కడ కురుస్తుంది. ఇళ్ళల్లోనుంచి బయలుదేరే మురుగుకాలవలన్నీ పెరటివైపుకు చేరుకుంటాయి. పందులూ కుక్కలూ జలక్రీడలకు కూడా అక్కడే కలుసుకుంటాయి.

పిల్లవాడివెంట వెళ్ళిన భద్రయ్య ఆ వెనకభాగానికి చేరుకున్నాడు. తల్లి పిల్ల తలను ఒళ్ళో పెట్టుకుని కన్నీరు కారుస్తోంది. చుట్టూ జనం మూగారు.

"ఈ చుట్టతో కణతమీద చురుకు తగిలిస్తే స్పృహ వస్తుందమ్మా" అంటున్నాడొకాయన.

"వద్దు బాబూ వద్దు. ఇప్పటికే నాలుగు చురకలు తగిలించారు. వాటినే చూడలేకపోతున్నాను" అంటూ ఏడ్చి. "నాయనా! నాన్న రాలేదూ!" అడిగింది కొడుకును. ఏడ్చి ఏడ్చి రాసుకుపోయిన గొంతులో.

"లేదమ్మా" అన్నాడు పిల్లవాడు. అక్కడి వాతావరణం చూడగానేభయం మరింత ఎక్కువైంది అతడికి. తండ్రి నీళ్ళలో పడిన సంగతి చెప్పలేకపోయాడు.

భద్రయ్య అప్పటికే కొంత గ్రహించాడు. అతడికి ఎన్నడూ కలగనంతగా చైతన్యం కలిగింది.

"రా బాబూ, నా యెంట రా. డాకటేరును నేను తీసుకొత్తా" పిల్లవాడి చెయ్యి పట్టుకుని గబగబా ముందుకు నడిచి రోడ్డు ఎక్కాడు. పరుగుతీసినట్టుగా పిల్లవాడితో బల్లకట్టు దగ్గరికి చేరుకుని గబగబా గడవేశాడు. మసక వెన్నెల వెలుగులో ఆ దరికి చేరుకుని ఊళ్ళోకి నడిచాడు.

చీకటి చీకటిగా ఉన్నాయి కొన్ని వీధులు. అవి దాటితే సిమెంటు రోడ్లు-వీధి దీపాలు. ఆ వెలుగులో పిల్లవాడిని నడిపించుకుపోయి ఒక డాక్టరింటి ముందర నిలబడి తలుపుకొట్టాడు.

"డాకటరు దొరా, పానంమీదికి వచ్చింది. తమ రొకపాలి రావాల" అంటూ దణ్ణాలు పెట్టాడు.

"ఎవరింటికి?" అడిగాడు డాక్టరు.

తండ్రిపేరు, చేస్తున్న ఉద్యోగం చెప్పాడు పిల్లవాడు.

"అలాగా!" అంటూ డాక్టరు బయలుదేరాడు పెట్టె చేతబట్టుకుని.

తెప్ప నడుపుతూ 'డాకటరు బాబూ! ఇటుకేసి కూడా వత్తూ ఉంటారా?" అడిగాడు భద్రయ్య.

"వస్తాను కాని- ఇటువైపు పని తక్కువ. అటువైపు ఆసుపత్రి, కాలేజీలు అన్నీ ఉండటంతో ఊరు బాగా పెరిగిపోయింది. మాకైనా అటే పనెక్కువ. డబ్బు కూడా అటే దొరుకుతుంది. కాని ఒకటి. ఇది పాత ఊరయినా డబ్బుకలవాళ్ళు చాలావరకు ఇటే ఉన్నారు. ఈ నదిమీద బ్రిడ్జికడితే బళ్ళ రాకపోకలు ఎక్కువవుతాయి. మాకు ప్రాక్టీసుకూడా బాగా వస్తుంది.

"ఈ ఊరికి ఇదే దురదృష్టం బాబూ" మాటల్లోనే ఏరుదాటి అడుగులమీద ఇల్లు చేరుకున్నారు.

ఇంటి వెనక జనం బాగా మూగారు.

తల్లి వెక్కి వెక్కి ఏడుస్తున్నది. డాక్టరు జనాన్ని నెట్టుకుంటూ మధ్యకు వెళ్ళాడు. పెట్టె తెరవకముందు పిల్ల చెయ్యిపట్టుకుని చూసి వదిలేశాడు.

పిల్లలంతా బిక్కముఖాలు పెట్టారు. ఆమె ముఖానికి పైటచెంగు అడ్డం పెట్టుకుని ఏడుస్తున్నది.

డాక్టరు గుంపులోనుంచి బయటికి రాగానే "ఏటయింది బాబూ?" ప్రశ్నించాడు భద్రయ్య.

"అయిపోయింది భద్రయ్యా. ఆలస్యంగా పిలిచావు." ఆయన కంఠధ్వనిలో ఇటువంటి కేసుకోసం ఇంతదూరం తీసుకువచ్చావన్న ధ్వని వినబడ్డది.

డాక్టరు పెట్టె బైటికి పట్టుకుని వస్తుండగా భద్రయ్య దీనంగా ముఖంపెట్టి "బాబూ, నాను ఏరు దాటిత్తాను పదండి. ఇంత మిగిలిపోయిందని తెలవదు నాకు." క్షమాపణ చెప్పుకున్నట్టుగా చేతులు జోడించి ఆయనవెంట బయలుదేరాడు.

మలుపు దగ్గర నిలబడ్డది పొన్ని. ఈతపుంతంతా వెతికి వెతికి అక్కడ నిలబడ్డది - ఇంకా ఏటి ఒడ్డునే ఉన్నాదేమోననుకుంటూ.

ఆమెను చూడగానే "పొన్నే. ఇయాళ అంతా నట్టమేనే" అన్నాడు తల వంచుకుని. ఆమెకూడా అతడితో తెప్పదగ్గరికి నడిచింది. తెప్పమీద ఉన్నంతసేపూ ఎవరూ నోరు విప్పలేదు.

డాక్టరు దిగిపోయేటప్పుడు భద్రయ్య, "దొరా! నా కాడ మిగిలింది ఇది. ఇదే ఇయ్యాల్టి సంపాదన. తమరికాడ ఉంచండి" అంటూ ఎనిమిది రూపాయలు చేతిలో పెట్టాడు.

"నాకెందుకోయ్. మందన్నా ఇవ్వలేదు. చచ్చినవాడికి ఫీజు ఎందుకు?" అంటూ తిరిగి ఇవ్వబోయాడు.

అట్టకాదు దొరా. తమరు అంత దూరం వచ్చినందుకు నాను ఇత్తుండాను. ఆరు పాపం ఇదీ ఇయ్యనేరు." డాక్టరు ముందుకు నడుస్తుంటే భద్రయ్య పొన్నితో తెప్పను కదిలించి మళ్ళించాడు.

"పొన్నే. మాటాడ వేందే?" అన్నాడు.

"ఏటి మాటాడేది?" అంది పొన్ని. భద్రయ్య ముఖం అంత విచారంగా ఉండటం చూడలేదు ఇంతవరకూ. ఏదో అతడి మనసులో బాధ ఉన్నట్టు గ్రహించింది.

"పొన్నే తిండి నేకపోవటంకట్టమా? ఇసుమంటివి కట్టమా! నీవే చెప్పు?" బలరాం సంగతంతా చెప్పి "సూడే. మడిసిని పాడుసేసినా ఆడదే, ముందుకు గుంజినా ఆడదే. మడిసిని మడిసిగా ఆడదే సెయ్యాల," ఆమె ముఖంలోకి చూశాడు.

"మంచి పని సేశాననుకుంటా బయలెళ్ళా. కాని నాభం లేకపోయింది" అన్నాడు భద్రయ్య డబ్బు లివ్వకపోవటం, అప్పు తెచ్చుకోవటం, తరువాత తీర్చటం అలవాటే. ఆమెకిది కొత్తకాదు. డబ్బులివ్వకపోయినా పొన్ని మనసు ఇవాళ సంతోషంగా ఉంది. సంచిలో ఉన్న డబ్బుల్తో ఈతపుంతకు వెళ్ళకుండా ఒక ప్రాణిని రక్షించటానికి వెళ్ళటమూ డబ్బు ఖర్చు చెయ్యటమూ ఆమెకు విచారాన్ని కలిగించలేదు.

"మామోయ్, మామా! ఇయాళ నీవు నిజంగా మడిసి వనిపించావు మామా!" భుజం మీద చెయ్యేసి విచారం పోగొట్టే మాటలు మాట్లాడుతూ ఇంటికి తీసుకు వెళ్ళి గిన్నెనిండా ఉప్పుగల్లు వేసిన గంజిపోసి చేతికిచ్చింది.

గంజి తాగి చేత్తో మీసాలు తుడుచుకుంటూ "పొన్నే" అన్నాడు. ఆ ధ్వని ఆమెకు వింతగా తోచింది. ఆనాడు భద్రయ్య మామ ఛాతీ చాలా విశాలంగా కనబడ్డది. ఆమెకు ఆమె మనసులోని నెరుసులన్నీ ఏరిపారేసింది.

(జయశ్రీ-ప్రత్యేక సంచిక)